క్లుప్తంగా

ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలి : మంత్రి



నల్లగొండ : బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న పార్కులో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి వారి సమస్యలను మంత్రికి విన్నవించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యల పరిష్కారం నిమిత్తం ఆయా అర్జీలను సంబంధిత అధికారుల వద్దకు పంపించారు.

నేటి నుంచి కరాటే శిక్షణ శిబిరం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని సాందీప్ హైస్కూల్‌లో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నేటి నుంచి కరాటే శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కరాటే ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నాంపల్లి కనకారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9849528349, 8096627608ను సంప్రదించాలని కోరారు.

వనజకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న వనజ

నకిరేకల్ : పట్టణానికి చెందిన కొండ్రెడ్డి వనజ శనివారం డాక్టరేట్ పొందారు. ఆమె ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ వద్ద గంగానదిలో ఆకశేరుకాల యొక్క కాలానుగుణగతిశీలతను విశ్లేషించడం అనే అంశంపై డాక్టర్ కపిల్‌కుమార్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గాను ఉత్తరప్రదేశ్‌లోని మొనాడ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా గాయత్రి

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన రాపోలు గాయత్రి బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి శనివారం ఆమెకు నియామకపత్రం అందజేశారు. అనంతరం గాయత్రి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాశక్క, జిల్లా నాయకురాలు కొండేటి సరితకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వినతి



రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేతేపల్లి : మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతు ప్రతినిధులు శనివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడంతో పాటు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, పురగిరి క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు, నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, పుల్లయ్య, మట్టి సాల్మన్, జటంగి సైదులు, సైదయ్య, గోపాల్ ఉన్నారు.

మార్చురీలోనే మృతదేహం

నకిరేకల్: మండలంలోని నోముల గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన యల్మకంటి రజిత మృతదేహం శనివారం రాత్రి వరకు కూడా స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీలోనే ఉంది. రజిత శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వేధింపులకు గురిచేయడంతోనే తన భార్య ఆత్మహత్య చేసుకుందని మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దమనుషులు ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకురావడం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు న్యాయం చేసేంత వరకు మృతదేహాన్ని తీసుకెళ్లమని మృతురాలి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణలు తెలిపారు.

విద్యార్థులు ఉద్యోగాలు సృష్టించాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మహిళా డిగ్రీ కాలేజీలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కాదు.. మరికొంత మందికి ఉద్యోగాలు సృష్టించాలని, అందుకు ఉన్నత స్థాయిలో రాణించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. డిగ్రీ చదువుతున్న సమయంలో విద్యార్థులంతా తప్పుదారి పట్టకుండా క్రమశిక్షణ కలిగి మంచి పౌరులుగా రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఏ అవసరమున్నా నాదృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. వారం రోజుల్లో తాగునీటి వసతిని కల్పిస్తామన్నారు. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన టాయిలెట్లు, బెంచీల సౌకర్యాలు కల్పించామన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. హైదరాబాద్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి అనుబంధంగా అక్కడ నిర్మించబోయే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉంటుందన్నారు. చిట్యాల, నార్కట్‌పల్లి ప్రాంతంలో జాతీయ స్థాయి భారీ పరిశ్రమలతో మాట్లాడి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్డీఓ రవి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, సుంకరి రాజారామ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : మంత్రి

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యానికి చేరుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లనే అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవితం చాలా విలువైందని ప్రాణం పోతే మళ్లీ తిరిగిరాదని, వాహనం నడిపేటప్పుడు కుటుంబాన్ని గుర్తు చేసుకుని జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. నల్లగొండలో ట్రాఫిక్, కాలుష్య నివారణకు ఔటర్ రింగ్‌రోడ్డును రూ.550కోట్లతో నిర్మించనున్నట్లు, అందుకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టణ గుమ్మల మోహన్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నల్లగొండ రూరల్ : క్లాక్‌టవర్ సెంటర్‌లో సిగ్నల్ లైట్లు ప్రారంభిస్తున్న మంత్రి, ఎస్పీ, చైర్మన్



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

హస్తకళా ప్రదర్శన ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత హస్తకళా మేళా ప్రదర్శనను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కళాభారతి అధ్యక్షుడు జెల్ల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి శనిగరం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లలో జిల్లా అగ్రగామిగా ఉండాలి

● బీఆర్ఏఓయూ జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్

రామగిరి(నల్లగొండ) : బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ యూజీ పీజీ అడ్మిషన్లలో తెలంగాణ రాష్ట్రంలో జిల్లా అగ్రగామిగా నిలపాలని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ధర్మానాయక్ అన్నారు. శనివారం పట్టణంలో ఉమ్మడి జిల్లా స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లు, కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరికీ ఉన్నత విద్య అవకాశాలు అందించాలనేది అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్దేశమన్నారు. ఇటీవల జరిగిన న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన ఘనత అంబేద్కర్ యూనివర్సిటీకి దక్కడం అందరి సమష్టి కృషి అన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్ వెల్లడైందన్నారు. ఈనెల 31వరకు అడ్మిషన్లకు చివరి గడువు ఉందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నోటిఫికేషన్ విడుదలైందని, అన్ని ప్రాంతాల్లో అవగాహన చేసి యూజీ, పీజీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులలో అడ్మిషన్లు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, ఎన్జీ కళాశాల సీనియర్ ఆధ్యాపకులు డాక్టర్ పరంగి రవికుమార్, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు బద్దం మహేష్ ,రేఖ్యానాయక్, శ్రీకాంత్, రమేష్‌నాయక్, శంకర్, సురేష్, ఉమ్మడి జిల్లాలోని కోఆర్డినేటర్స్, జాక్టో, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.



డాక్టర్ బి.ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న కోఆర్డినేటర్లు, జాక్టో, కౌన్సిలర్స్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నకిరేకల్ : నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటన సందర్భంగా శనివారం పట్టణంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌యాదవ్, ప్రతినిధులు ఏకుల గణేష్, శౌర్య, సందీప్, మాద వంశీ, బండి శ్రీను, సింహాద్రి పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలని వినతి

నల్లగొండ టౌన్ : బీసీల కులగణన వెంటనే చేపట్టాలని కోరుతూ శనివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, చొల్లేటి ప్రభాకర్, యాదగిరి, పర్వతాలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ర్యాలీ



నల్లగొండ టౌన్ : నిరసన ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న హింసను ఆపాలని పట్టణంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గడిచిన పది నెలల్లో సామ్రాజ్యవాద అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ సాగించిన దారుణ నరమేధంలో 40వేల మందికిపైగా పాలస్తీనీయులు మృతి చెందారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, ఎండీ సలీం, నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, మహేష్, అనురాధ, సరోజ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కందాల ప్రమీల, వంటిపాక వెంకటేశ్వర్లు, మర్రి వెంకటయ్య, ఇందిర, వంటిపాక కృష్ణ, తాజేశ్వర్, లక్ష్మి, ప్రకాష్‌రావు, రవీందర్, లక్ష్మణ్‌రావు, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి

చండూరు(గట్టుప్పల్) : ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. బ్యాంకులో పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ చేయాలన్నారు. పేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, బొమ్మరబోయిన లాలు, రాపోలు సత్తయ్య, గడ్డం నవీన్, వర్కల యాదగిరి, టేకుమట్ల లింగస్వామి, గోపయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

ఏఈఈ ఉద్యోగాలకు పలువురి ఎంపిక



మనోజ్‌కుమార్



కానుగు నిఖిత



కావేటి వెంకటేష్



కన్నెబోయిన బాలకృష్ణ

నకిరేకల్ : టీజీపీఎస్సీ విడుదల చేసిన సివిల్ ఏఈఈ ఫలితాల్లో నకిరేకల్ పట్టణానికి చెందిన నలగొండ మనోజ్‌కుమార్ పబ్లిక్ హెల్త్ (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్) విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పోస్టుకు శనివారం ఎంపికయ్యాడు. మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు సత్యనారాయణ మండలంలోని చందుపట్ల జెడ్పీ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా, తల్లి సరిత పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

సివిల్ ఇంజనీర్‌గా నిఖిత ఎంపిక

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన కానుగు నిఖిత శుక్రవారం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఫలితాల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏఈఈగా ఎంపికైంది. ఈ సందర్భంగా నిఖితను శనివారం పలువురు బంధువులతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

మిషన భగీరథ ఏఈఈగా వెంకటేష్..

మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన కావేటి వెంకటేష్ ఈనెల 2న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఏఈఈ (మిషన్ భగీరథ)గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించారు.



హర్షిణి

ఏఈఈ ఉద్యోగాలు సాధించిన ఆణిముత్యాలు

నాంపల్లి : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం ప్రకటించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఫలితాలతో మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన బాలకృష్ణ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో కార్యనిర్వాహక ఇంజనీరింగ్ ఉద్యోగం సాధించాడు. అదే విధంగా దేవత్‌పల్లి గ్రామానికి చెందిన జక్కుల రమేష్, కేతపల్లి గ్రామానికి చెందిన పోలేపల్లి ప్రసాద్, గానుగుపల్లి గ్రామానికి చెందిన ఆకులపల్లి సుధాకర్ ఇరిగేషన్ ఏఈఈలుగా ఉద్యోగం సాధించారు.

నీటి పారుదల శాఖలో ఏఈఈగా హర్షిణి

నార్కట్‌పల్లి : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో పట్టణానికి చెందిన అనమల్ల హర్షిణి నీటి పారుదల శాఖ ఏఈఈ ఉద్యోగం సాధించింది.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నాంపల్లి : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం జరిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో ఆదర్శ, కస్తూరిబా గాంధీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలు 3ఉన్నా డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే చొరువ చూపి ప్రాంతం అభివృద్ధికి డిగ్రీ కళాశాలను మంజూరు చేయించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు చిరుమావిళ్ల గిరిబాబు, శంకర్, పోలగోని శ్రీకాంత్, శివగౌడ్, ధరమ్‌సింగ్, లవకుమార్, శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

నల్లగొండ టూటౌన్ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని, ప్రతి తల్లి బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బాలరాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని పానగల్ బీసీకాలనీ, ఎరుకలవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబాసాహెబ్ లక్ష్మణ్‌సింగ్, డాక్టర్ అశోక్‌దేవ్, డాక్టర్ నేహారెడ్డి, హెల్త్ అసిస్టెంట్స్ నగేష్, శుముద్దిన్ పాల్గొన్నారు.

నల్లగొండ : పట్టణంలోని హౌజింగ్‌బోర్డు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇ.మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు కె.పద్మ, అమిమా బేగం, పి.సరస్వతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : మండలంలోని బుద్ధారం గ్రామంలో శనివారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కనగల్ : మండలంలోని దర్వేశిపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవిరెడ్డి పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజలి, సరిత, లక్ష్మి ఉన్నారు.

చిట్యాల : మండలంలోని చిట్యాల మున్సిపాలిటీతో పాటు వివిధ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రోజా, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

చండూరు : ముర్రుపాలు పుట్టిన బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ మునుగోడు సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యాదమ్మ, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు మౌనిక, సునీత, ఏఎన్ఎం, ఆశవర్కర్లు ఉన్నారు.

కట్టంగూర్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని గార్లబాయిగూడెం, చెర్వుఅన్నారం, అంబటివాగు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు టీచర్లు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సీహెచ్ లలిత, ఎస్.అరుణ, భిక్షమమ్మ, చంద్రకళ, మంగమ్మ, లలితకుమారి, ఏఎన్ఎం ఉన్నారు.

నాంపల్లి : మండల కేంద్రంతో పాటు, మండలంలో పలు గ్రామాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుళ్ల థెరిస్సా, నాంపల్లి ఇందిరా, మహిళలు, చిన్నారులు ఉన్నారు.



నల్లగొండ టూటౌన్ : తల్లిపాల వారోత్సవాలలో అవగాహన కల్పిస్తున్న కామినేని వైద్యులు

ఘనంగా ఫ్రెండ్ షిప్ డే

చిట్యాల : పట్టణంలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఫ్రెండ్ షిప్ డే ఆకారంలో కూర్చుని తన సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం విద్యార్థులంతా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకోని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్‌కుమార్ రెడ్డి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏటపోలా గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్షిప్త సమాచారం

రైస్ మిల్లర్లతో ఎస్ఈ సమావేశం

చిట్యాల : రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై మండలంలోని వట్టిమర్తి గ్రామంలో చిట్యాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లర్స్ మాట్లాడారు. లోఓల్టేజీతో పాటు తరచు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎస్ఈకి తెలిపారు. దీంతో విద్యుత్ సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన రైస్‌మిల్లర్లకు హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఈ రవీందర్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

మునుగోడు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారాలు అందించాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డు జిల్లా అధికారి శ్రీనివాస్ కోరారు. ప్రతి మండల కేంద్రంలో ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ మునుగోడు జెడ్పీ పాఠశాలను ఎంపిక చేయడంతో శనివారం వివిధ పార్టీల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ పూజ, మండల విద్యాఅధికారి కె.నర్సింహ, పంచాయతీరాజ్ ఏఈ సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవలో పోచంపల్లి బ్యాంక్

చండూరు : వినియోగదారులకు సేవలందించడంలో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ముందుంటుందని ఆ బ్యాంక్ మేనేజర్ మంచాల స్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. సమావేశంలో మనోహర్, వెంకట్‌రెడ్డి, మాధవి, రాఘవేంద్ర ఉన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా స్వామి

చిట్యాల : మున్సిపాలిటీకి చెందిన బోడ స్వామిని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా నియమిస్తూ ఆ సెల్ రాష్ట్ర కన్వీనర్ నగరి ప్రీతం జారీ చేసిన ఉత్తర్వులను శనివారం నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందజేశారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

చిట్యాల : మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను ఆయన పరిశీలించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

నకిరేకల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 11న నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను శనివారం పట్టణంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్, కల్లుగీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్, నాయకులు కొండ రాజేష్, లింగారపు మధుసూదన్, చనగాని రవి, కొండ యాదగిరి, చెవుగోని వెంకన్న, కొండ శ్రీను, వెంకన్న, యాదగిరి, సైదులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

శాలిగౌరారం : ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసంచేసిందని బీఆర్ఎస్వీ తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చొగోని అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

విద్యార్థులకు షూ పంపిణీ

కట్టంగూర్ : మండలంలోని కల్మెర గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం స్నేహ లయన్స్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో షూ, సాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య , లయన్స్ క్లబ్ సభ్యులు ఎర్ర అనిత, మామిడి పద్మ, దీపిక, ఎంఎన్ఓ ఏ అంజయ్య, హెచ్ఎంలు బద్రి నారాయణ, నర్ర సరళ, సీఆర్పీ రమేష్, కార్యదర్శి ప్రసన్నరాణి ఉన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ టూటౌన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో శనివారం పట్టణ సమీపంలోని మర్రిగూడలో ప్రజా దళిత సంక్షేమ సమితి చైర్మన్ బీపంగి జగ్జీవన్‌రామ్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీపంగి జగ్జీవన్‌రామ్, బీపంగి చంటి, పందుల వెంకట్, పందుల ప్రసాద్, బొజ్జ ప్రణయ్, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నల్లగొండ టూటౌన్ : ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని లయన్ గద్దం ప్రదీప్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నేహ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గీతాంజలి కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు అనితారాణి, మామిడి పద్మ, సరళ యాస, లయన్ బండారు పుష్ప, కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్‌ను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శనివారం డీఈఓ బి.భిక్షపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని సమస్యలపై విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదుపై విచారణ..

అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు సంబంధించిన గణితశాస్త్రం బోధన తరగతులు నెలరోజులుగా సరిగాజరగడం లేదని ఆ గ్రామస్తుల ఫిర్యాదుతో పాఠశాలలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జరిగిన విషయంపై డీఈఓకు హెచ్ఎం నివేదికను అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాంపల్లి : మండలంలోని వడ్డెపల్లిలో 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం మండల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్న సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.